క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాండ్లపెంట: స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో గాండ్లపెంట, ఎన్పీకుంట మండలాల్లోని ఆర్డీటీ పాఠశాలల్లో 4,5 తరగతులు చదివే విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. తెలుగు, గణితం, సైన్స్, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన అంశాలపై పోటీలు చేపట్టారు. తెలుగులో భారతి, గణితంలో జస్వంత్, సైన్స్‌లో యోహోసోనాయక్, జనరల్ నాలెడ్జ్‌లో నాగలోకేశ్వరీ ప్రథమ బహుమతి గెలుపొందారు. ఫిబ్రవరి 5న రీజినల్ స్థాయిలో పాల్గొనేందుకు అర్హత సాధించారని ఏటీఎల్ క్రిష్ణా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్దారెడ్డి, మహబుబ్‌బాషా,యూనుస్, సీఓలు గంగాంద్రి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నార్శింపల్లి తండాలో మారెమ్మ జాతర

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలోని నార్శింపల్లి తండాలో మంగళవారం మారెమ్మ జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల వాసులతో పాటు మంచి పదవుల్లో, ఉద్యోగాల్లో ఉన్న వారు సైతం పెద్దెత్తున జాతరలో పాల్గొననున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన ఎల్లప్ప

నల్లచెరువు: మండల పరిధిలోని ప్యాయలవాండ్లపల్లి బస్టాప్ సమీపంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొని ఓరువాయి గ్రామానికి చెందిన ఎల్లప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు... మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్య శాలలో అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎల్లప్ప సోమవారం తన ద్విచక్ర వాహనంపై పాడి ఆవుకు ఇంజెక్షన్ వేయడానికి పాత రైల్వే స్టేషన్ వైపు వెళ్తున్నాడు. జాతీయ రహదారిపై మదనపల్లి నుంచి కదిరి వైపు వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు వెనుక నుంచి ఎల్లప్ప ప్రయాణిస్తున్న స్కూటర్‌ను వేగంగా ఢీ కొట్టాడు. దీంతో ఎల్లప్ప కుడి కాలు పాదం విరిగింది. స్థానికులు గమనించి 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

గాండ్లపెంట: మండల పరిధిలోని గాజులవారిపల్లి సబ్ స్టేషన్‌పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ విశ్వనాథ్ సోమవారం తెలిపారు. గాజులవారిపల్లి సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలకు మెటీరియల్ పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

కనగానపల్లి: మండలంలోని జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలకు సోమవారం పరీక్షల మెటీరియల్, గ్రంథాలయ పుస్తకాలు, బైజూస్ ట్యాబ్‌లు, టాయ్‌లెట్ క్లీనింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రామన్న, ప్రధానోపాధ్యాయులు నజీర్, నాగేంద్ర, భ్రమరదేవి, బాబు, బాషా, శివయ్య, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లోకి అంగన్‌వాడీలు



విధుల్లో చేరుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

బత్తలపల్లి/తాడిమర్రి/ముదిగుబ్బ: అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. సోమవారం నుంచి తాము ఇష్టపూర్వకంగానే సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్లు ఐసీడీఎస్ బత్తలపల్లి ప్రాజెక్టు సీడీపీఓ సరస్వతికి రాతపూర్వకంగా వినతి పత్రాలను అందజేసి విధుల్లోకి చేరారు. బత్తలపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కింద బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలు వస్తాయి. ఈ మండలాల్లో మెయిన్ సెంటర్లు 158, మినీ సెంటర్లు 76 మొత్తం 234 ఉండగా అందులో విధులు నిర్వహిస్తున్న వర్కర్లు 234 మంది, హెల్పర్లు 158 మంది విధులకు హాజరవుతున్నట్లు సీడీపీఓ తెలిపారు.

ఊరూరా రామనామమే..



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ధర్మవరంలో గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న మహిళలు



కదిరిలో శ్రీరామ చిత్రపటానికి పూజలు

బత్తలపల్లి: అయోధ్యలో బాలరాముడి దివ్య ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ధర్మవరం, కదిరి, రాప్తాడు, పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రామనామ స్మరణ మార్మోగింది. సోమవారం ఉదయం గ్రామాల్లోని రామాలయాల్లో అభిషేకాలు, అర్చనలు అర్చకులు నిర్వహించారు. రామాలయాలను విద్యుద్దీపాలంకరణ, మామిడి తోరణాలు, టెంకాయ పట్టలతో అందంగా ముస్తాబు చేశారు. గంగపూజ, కలిశ పూజ, మహాగణపతి పూజ, పుణ్యాహుతి, శ్రీరాములవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవం ప్రారంభం కాగానే ఆలయాల్లో భజనలు చేపట్టారు. మహా మంగళహారతి ఇచ్చారు.

కదిరి పట్టణంలో..

కదిరి టౌన్: కదిరి పట్టణంలో ఖాద్రీ లక్ష్మినరసింహ స్వామి ఆలయంలోని శ్రీరాముల ఆలయం, పంచముఖి ఆంజనేయస్వామి, సైదాపురం ఆంజనేయ స్వామి ఆలయం, గొల్లబామ మండపం వద్ద ఉన్న శ్రీరాముల ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు శ్రీరాముని విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక భజనలు చేశారు. యువకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి,ఆలయ చైర్మన్ గోపాలక్రిష్ణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, నాయకులు గంగాధర్,సుదర్శన్, వెంకటేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

తలుపుల మండలంలో..

తలుపుల: మండల కేంద్రం ఓబీఆర్ రోడ్డులోని రామాలయం, బలిజపేట రామాలయం, టి.రెడ్డివారిపల్లి రామాలయం, పల్లవాండ్లపల్లి రామాలయంలలో ప్రత్యేక పూజలు చేసి శ్రీసీతారాముల వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం బలిజపేటలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు.

ఎన్పీ కుంట మండలంలో..

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని పుర వీధులతో పాటు, ఎస్.రెడ్డివారిపల్లి, చీమలచెరువుపల్లి, పి కొత్తపల్లి గ్రామాలలో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. రామాలయంలోని ఉత్సవ విగ్రహాలను వివిధ పూలతో, విద్యుత్ దీప కాంతులతో అలంకరించిన చాందిని బండిలో పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.



కదిరిలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు



బత్తలపల్లి: పూజలందుకున్న ఉత్సవమూర్తులు

అమడగూరు: మండలంలోని అన్ని గ్రామాలు సోమవారం రామమయంగా మారాయి. ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయోధ్య అక్షింతలను ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. చెక్క భజనలు, కోలాటలు చూపరులను ఆకట్టుకున్నాయి.

కనగానపల్లి: కనగానపల్లిలో రామాలయం, తగరకుంట, మామిళ్లపల్లి, పాతపాళ్యం, శివపురంలోని సీతారామాలయాల్లో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శ్రీరాముడి చిత్రపటాలతో ఊరేగించారు. సాయంత్రం ఆలయాల వద్ద దీపారాధన, భజనలు చేశారు. మామిళ్లపల్లి సీతారామలయం వద్ద గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముదిగుబ్బ: విశ్వభారతి పాఠశాలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రాముడు, లక్ష్మణుడు, హనుమంతుడు వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. సానేవారిపల్లి గ్రామంలో సీతారాముల గ్రామోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కేశవ, బజరంగ్ దళ్ మహస్తంద్ర, శ్రీనాథ్‌గౌడ్, పవన్‌కుమార్, ఎస్.శ్రీనాథ్, చిన్న నరసింహులు, పెద్ద నరసింహులు, గణేష్, శశికుమార్ మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: గాండ్లపెంట, వేపరాల, కటకంవారిపల్లి, వేపలకుంట, తూపల్లి, జీనులకుంట, కమతంపల్లి, సోమయాజులపల్లి, గాజులవారిపల్లి తదితర గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాల్లో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

తాడిమర్రి: తాడిమర్రి బోయ, బలిజ వీధి, కాపు వీధుల్లో ఉన్న సీతారాముల ఆలయాలు, తూర్పుముఖ ఆంజనేయస్వామి ఆలయం, కునుకుంట్ల, పిన్నదరి, పెద్దకోట్ల, దాడితోట, చిల్లవారిపల్లి తదితర శ్రీరాముని ఆలయాలతో పాటు నిడిగల్లు, పత్రపల్లి, మద్దులచెర్వు, పుల్లంపల్లి, ఏకపాదంపల్లి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము 4.30 గంటల నుంచి ఆలయాలకు భక్తుల తాకిడి మొదలైంది.

తనకల్లు: మండల కేంద్రంలోని హరిజనవాడ, ఎస్‌బీఐ వీధులలోని రామాలయాల వద్ద ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో భక్తాదులకు సోమవారం పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సమరసింహారెడ్డి, వినోద్‌కుమార్, హరినాథ్‌రెడ్డి, ప్రసాద్, వెంకటేష్, సురేంద్ర, రామకృష్ణ, చంద్ర, తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలంలోని శ్రీరామ ఆలయాల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి దీపారాధన, పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన సౌకర్యం కల్పించారు.

విగ్రహ ప్రతిష్టను కళ్లారా చూసి.. తరించి

నల్లమాడ: నల్లమాడలోని రామస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయం వెలుపల ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి అయోధ్యలో జరిగిన బాల రాముడి ప్రాణ ప్రతిష్టను భక్తులు కళ్లారా వీక్షించే ఏర్పాట్లు చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. పురవీధుల్లో భజన కార్యక్రమం చేపట్టారు. సీతారామలక్ష్మణ ఆంజనేయ వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు పొరకల రమణ, గోపాలయ్యశెట్టి, ఎల్ఐసీ రమణ, వాసుదేవగుప్త, కరణం రమేష్, రఘునాథరెడ్డి, బుట్టి నాగభూషణ నాయుడు, చింతకాయల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

• పెమనకుంటపల్లిలో సాయిబాబా భక్తుడు పుట్ల నాగభూషణ ముగ్గుల పోటీ నిర్వహించారు. ఉపాధ్యాయుడు కనుముక్కల లక్ష్మన్న, గ్రామపెద్ద పఠాన్ అబ్దుల్ రఫీ ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి టి.కవిత, సరస్వతి, రెండో బహుమతి దీపిక, సరిత సంయుక్త పంచుకున్నారు. మూడో బహుమతి డి.అరుణమ్మ ఎంపిక కాగా, స్టీల్ బాక్సులను అతిథులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులను అందించారు.

ఊరూరా రామనామ స్మరణ

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తిలో రాములోరి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. హనుమాన్ జెండాలు, జాతీయ పతాకాలతో వీధులు రెపరెపలాడాయి. హిందూవులు, విదేశీయులు, కశ్మీరీ ముస్లిం సోదరులు సైతం పాల్గొనడం విశేషం. రాములోరికి పూజలు, ఉత్సవ మూర్తుల విగ్రహాల ఊరేగింపులు, బైకు ర్యాలీలు చేపట్టారు. డీజే భక్తి పాటలకు చిందేస్తూ కదం తొక్కుతూ భక్తులు ముందుకు సాగారు. ఊరూ వాడ శ్రీరాముని ఆలయాలు పచ్చటి తోరణాలు, అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆనంద డోలికల్లో తేలియాడారు.

బైకు ర్యాలీలు.. గ్రామోత్సవాలు

ధర్మవరం అర్బన్: ధర్మవరంలో శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య, కార్యదర్శి జింకా చిన్నప్ప, సభ్యులు బొడగల శంకర్, గోలి నాగభూషణం, జింకా పెద్ద రెడ్డప్ప తదితరుల ఆధ్వర్యంలో కాషాయ జెండాలు పట్టుకుని పట్టణ పురవీధుల్లో పద్మశాలీయులు, హిందువులు బైకు ర్యాలీ నిర్వహించారు. గీతానగర్ సమీపంలో చేనేత ప్రముఖులు గుద్దిటి సోమదాసు శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేయించారు. అన్నదానం చేశారు. రామ్‌నగర్‌లోని రామాలయంలో శ్రీరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. గట్టు చౌడప్ప, హరి, బండి శీనా, రామకృష్ణల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించగా మహిళలు కోలాటం ఆడుతూ శ్రీరాముని నామసంకీర్తనలు ఆలపించారు. దుర్గానగర్‌లోని రామాలయంలో శ్రీరామునికి ప్రత్యేక పూజలతోపాటు వందలాది మందికి అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. శివానగర్ కోదండరామస్వామి ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కాచర్ల అంజి ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. యాదవవీధిలోని రామాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

• పట్టణంలోని సాంస్కృతిక మండలిలో శ్రీ లలిత నాట్య కళానికేతన్ మాస్టర్ బాబు బాలాజీ ఆధ్వర్యంలో 'అంతా రామమయం అయోధ్య రామయ్యకు నృత్య నీరాజనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. 60 మంది బాల నర్తకులచే అంతా రామమయం అనే నృత్య రూపకం ప్రదర్శించి శ్రీరామచంద్రునికి నృత్య నీరాజనం సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా జాయింట్ కార్యదర్శి పెనుకొండ వేదవ్యాస్, అనంతపురం రంగస్థల సకలవృత్తి కళాకారుల సంఘం అధ్యక్షుడు ఆనంద్, సాంస్కృతిక మండలి ట్రెజరర్ సత్రసాల ప్రసన్నకుమార్‌లు మాస్టర్ బాబుబాలాజీని శాలువాలతో సత్కరించారు.



అయోధ్య రామయ్యకు నృత్య నీరాజనం అర్పించిన కళాకారులతో నిర్వాహకులు



నల్లమాడలో ర్యాలీ..



తాడిమర్రిలో ఉత్సవవిగ్రహాల గ్రామోత్సవం



బత్తలపల్లి మండలం వేల్పుమడుగులో అన్నదానం



కనగానపల్లి: మామిళ్లపల్లిలో చిత్రపటం ఊరేగింపు



తనకల్లు రామాలయం వద్ద అన్నదానం

వైఎస్సార్ సీపీలోకి భారీగా వలసలు



పార్టీలో చేరిన వారితో బీఎస్ మక్బూల్ అహ్మద్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరారు. సోమవారం రాత్రి మహమ్మద్, దాదాపీర్, ఇమ్రాన్, అంజార్ హుస్సేన్, అల్లాబకష్, అయాజ్, సుహేల్, సిద్దిక్, జిలాన్, ఫాజిల్, బక్షు, ఖాదర్‌బాషా, సుభాన్‌తో పాటు 190 మంది దాకా పార్టీలో చేరారు. 22వ వార్డు కౌన్సిలర్ కూరగాయల ఇస్మాయిల్‌తో కలిసి పార్టీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు.

తలుపుల: మామిళ్లవారిపల్లి, మూలపల్లి గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు పురుషోత్తంరెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, వెంకటరమణ, రాజాతో పాటు మొత్తం 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ సమక్షంలో కదిరిలోని ఆయన స్వగృహంలో సోమవారం పార్టీలో చేరారు. జిల్లా సంయుక్త కార్యదర్శి కుర్లి శివారెడ్డి, బత్రేపల్లి మాజీ సర్పంచ్ సుబ్బారెడితో కలిసి మక్బూల్ అహమ్మద్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

తనకల్లు: గోళ్లవారిపల్లి హరిజనవాడలో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సర్పంచ్ సరస్వతీ, నాయకులు అమాన్, రమణారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రాజారెడ్డి, జంగమరెడ్డి, నిజాం, కొండా మల్లికార్జున, రామకృష్ణ, తదితరులున్నారు.

ఓడీ చెరువు మండలంలో..

అమడగూరు: ఓడీ చెరువు మండలంలోని సున్నంపల్లికి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేపట్టిన వైఎస్సార్ రైతు విజయ సంకల్ప పాదయాత్రలో వారంతా పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కండువా వేసి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన చదివే లక్ష్మినరసమ్మ, చదివే గంగిరెడ్డి, చదివే బావిరెడ్డి, చదివే యర్రపరెడ్డి, చదివే ఆదినారాయణరెడ్డి, చదివే నందమోహన్‌రెడ్డి, సోమఘట్ట హరినాథరెడ్డితో పాటు పలు కుటుంబాలు పార్టీలో చేరాయి. అంతకుముందు పాదయాత్రకు వడ్డెర్లు మద్దతు పలికారు. గాజులపల్లి వద్ద ఉన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఎమ్మెల్యే పండ్లు పంచిపెట్టారు.

వైఎస్ జగన్‌తోనే బడుగులకు న్యాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో అందరివాడు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రామగిరి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ప్రభుత్వ గోడౌన్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను దగా చేసిందన్నారు. ఎంపీపీ మీనుగ నాగమ్మ, సర్పంచ్ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి నియోజకవర్గ ఓటర్లు @ 2,10,076 మంది

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కొత్తచెరువు	16,197	16,588	02	32,787
బుక్కపట్నం	16,123	16,343	00	32,466
పుట్టపర్తి రూరల్	11,163	11,189	02	22,352
పుట్టపర్తి అర్బన్	12,940	13,611	07	26,558
నల్లమాడ	16,854	16,878	01	33,733
ఓడీ చెరువు	19,219	19,520	01	38,740
అమడగూరు	11,596	11,841	03	23,440

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజకవర్గంలోని 6 మండలాల పరిధిలో 2,10,076 మంది ఓటర్లు ఉన్నట్లు ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. సోమవారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటర్ల జాబితాను ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్లు కలిసి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నూతన ఓటరు నమోదుకు ఇంకా సమయం ఉందని, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలో 238 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వెల్లడించారు. 1,878 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఏఓ జిలాని, నల్లమాడ తహసీల్దార్ మనోజ్‌కుమార్‌రెడ్డి, డీటీ నరసింహులు, ఈడీటీ దేవేంద్ర నాయక్, మంజుల, మోహన్‌బాబు, హరిక్రిష్ణ, రెహమాన్, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

ధర్మవరం అర్బన్: అక్రమ మద్యం, నాటుసారాపై ఉక్కుపాదం మోపుతామని సెబ్ నూతన సీఐ వై.గురుప్రసాద్ పేర్కొన్నారు. ధర్మవరం సెబ్ స్టేషన్‌లో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా నాటుసారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. ఎక్కడైనా అసాంఘి కార్యకలాపాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

బాధ్యతల స్వీకరణ

తనకల్లు: సెబ్ నూతన సీఐగా ప్రశాంత్ విజయ్ కుమార్ సోమవారం స్థానిక సెబ్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా కర్ణాటక మద్యాన్ని, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కదిరి రూరల్ సీఐగా మోహన్...

కదిరి అర్బన్: కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐగా అనంతపురం సీసీఎస్‌లో పనిచేస్తున్న మోహన్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న సూర్యనారాయణను వీఆర్‌కు పంపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక

ధర్మవరం అర్బన్: జాతీయ సమైక్యత శిబిరానికి ధర్మవరం డిగ్రీ విద్యార్థి ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ధార్వాడలోని కర్ణాటక యూనివర్సిటీలో ఈనెల 24 నుంచి 30 వరకు జరిగే శిబిరానికి కళాశాల తమ విద్యార్థి ముళ్లపాటి సాకే ఉదయ్‌కిరణ్ ఎంపికయ్యాడని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి ఎంపీపీఎస్‌లో సోమవారం వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగి వేమన పద్యాలపై పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి అఖిలబాను, ద్వితీయ బహుమతి జస్సీ, తృతీయ బహుమతి సనా ఫిర్దౌస్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్‌రెడ్డి, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు మరియ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

తనకల్లు: మండల పరిధిలోని బొంతలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎండీ ఖాసీంఖాన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి, పలువురు ఉపాధ్యాయులు మృతదేహం వద్ద పూలమాలలు ఉంచి నివాళ్లర్పించారు.

అర్హులందరికీ ఓటు హక్కు

ధర్మవరం అర్బన్: నియోజకవర్గంలో అర్హులందరికీ ఓటు హక్కును కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ యుగేశ్వరిదేవి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు, బీఎల్ఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టరేట్ కార్యాలయం వద్దనే తుది జాబితా పత్రాలను పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ హంపయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీని కలిసిన మక్బూల్

కదిరి అర్బన్: కదిరి మండల జెడ్పీటీసీ రాధాబాయ్‌ను సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ కలిశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించుకుందామన్నారు. లీగల్ సెల్ జోనల్ అధ్యక్షులు లింగాల లోకేశ్వరెడ్డి, ఎస్టీసెల్ నాయకులు క్రిష్ణానాయక్,సీనియర్ నాయకులు జయరామిరెడ్డి,రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు బత్తల ఇంటికి మంత్రి పెద్దిరెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఇంటికి మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రానున్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు అనుబంధ విభాగాల సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.